ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 26 జూలై 2025



స్వామి వివేకానందకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి, సేవా సమితి ప్రతినిధి శివవర్మ తదితరులు.. 8లో

ఎన్టీఆర్ వైద్యసేవలో డయాలసిస్

పది రోజుల్లోగా ఆకివీడు సీహెచ్‌సీలో అందుబాటులోకి.. పట్టణంలో రెండు రైల్వే అండర్‌పాస్‌ల ఏర్పాటు : డిప్యూటీ స్పీకర్

ఆకివీడు, జూలై 25(ఆంధ్రజ్యోతి):ఆకివీడు సీహెచ్‌సీలో డయాలసిస్ సెంటర్‌ను రాబోయే పది రోజుల్లోగా ఎన్టీఆర్ వైద్యసేవతో అనుసంధానం చేయనున్నట్టు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు, కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. సీహెచ్‌సీలో శుక్రవారం ఎక్స్‌రే యూనిట్, రక్త నిల్వ విభాగాలను ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ అనుసంధానంతో ఆసుపత్రి రెండోషిఫ్ట్ పనిచేసేలా చూస్తాం. త్రీ పేస్ సమస్యలు తలెత్తకుండా కొత్త జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటి, సిమెంట్ రోడ్లు వేస్తాం. ఆకివీడులో దాతలకు కరువు లేనందున, వసతులు దానికంతట అవే సమకూరుతాయి. ఆకివీడులో డబ్లింగ్ లైన్ కారణంగా రైళ్ల రాకపోకలు పెరిగాయి. ఈ కారణంగా తరచూ గేట్లు పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రెండు రైల్వే అండర్ పాస్‌లు ఏర్పాటు చేస్తున్నాం' అని చెప్పారు. డీసీహెచ్‌వో సూర్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్, డాక్టర్ భువన, వైద్యులు బిలాల్, అచ్యుత్ గణేశ్, టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, అజ్మల్, జాకీర్ తదితరులు ఉన్నారు.

మడపై ఫోకస్

నరసాపురం, మొగల్తూరుల్లో వెయ్యి ఎకరాల్లో మడ అడవులు



నర్సాపురం, మొగల్తూరు ప్రాంతాల్లో విస్తరించి ఉన్న మడ అడవుల్లోనూ ఫిషింగ్ క్యాట్‌లు వున్నట్టు వన్యప్రాణి పరిరక్షణ సంస్థలు గుర్తించాయి. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉంది. అటవీ శాఖకు మడ అడవులు అప్పగిస్తే అక్కడ వృక్ష సంపద, జీవ వైవిధ్యం, విస్తీర్ణం పెంపు వంటి అంశాలతో డాక్యుమెంట్‌ను రూపొందించే అవకాశం ఉంటుంది. కాకినాడ జిల్లా కోరంగి వద్ద ఎప్పటికప్పుడు డాక్యుమెంట్‌లను తయారు చేస్తున్నారు. అదే తరహాలో ఇక్కడ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలన్న తలంపుతో జిల్లా అధికారులు అడుగులు వేస్తున్నారు.



ఎన్నో రకాల జీవరాశులు

- రెవెన్యూ శాఖ నుంచి అటవీ శాఖకు బదిలీ.. అధికారుల కసరత్తు..
- జీవ వైవిధ్యానికి కేంద్రం పెద్ద పీట
- ఫిషింగ్ క్యాట్, పక్షులు వంటి జీవులకు ఆలవాలం

(భీమవరం-ఆంధ్రజ్యోతి):

జిల్లాలో విస్తరించి ఉన్న మడ అడవుల సంరక్షణ బాధ్యతను అటవీ శాఖకు అప్పగించనున్నారు. ప్రస్తుతం వీటిని రెవెన్యూ శాఖ సంరక్షిస్తోంది. నరసాపురం, మొగల్తూరు మండలాల పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల్లో ఈ అడవులు విస్తరించాయి. జిల్లాలో అడవులు లేనప్పటికి భీమవరం కేంద్రంగా ఏర్పాటైన పశ్చిమ గోదావరి జిల్లాకు ఆ శాఖను ఏర్పాటు చేశారు. ఇటీవల నర్సరీలను పెంచే పనిని ఈ శాఖకు అప్పగించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దాదాపు 4.50 లక్షల మొక్కలను అటవీ శాఖ పెంచింది. జిల్లా డ్వామా ఆధ్వర్యంలో మున్సిపాలిటీలు, పంచాయతీలు, ఇతర శాఖలకు మొక్కలను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది 11 లక్షల మొక్కలను పెంచేలా డ్వామా కసరత్తు చేస్తోంది. అందులోనూ ప్రత్యేకంగా అటవీ శాఖకు కొన్ని మొక్కలను పెంచే బాధ్యతను అప్పగించను న్నారు. అంతవరకే జిల్లా అటవీ శాఖ పరిమిత మవుతోంది. జిల్లా అటవీ అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను పెంచుకునే పనిలో నిమగ్నమయ్యారు. సముద్ర తాబేళ్ల హ్యాచరీని మొదటిసారిగా చేపట్టారు. మొగల్తూరు మండలంలో గత ఏడాది 15 వేల సముద్ర తాబేళ్ల గుడ్లను సేకరించి హ్యాచరీల్లో పెట్టారు. అవి పిల్లలైన తర్వాత సముద్రంలో విడిచి పెట్టారు. ఈ ఏడాది కూడా హ్యాచరీ నిర్వహించేందుకు ప్రణాళిక చేస్తున్నారు. వీటితోపాటు మడ అడవులను సంరక్షించే బాధ్యతను అప్పగించాలని రెవెన్యూ శాఖకు ప్రతిపాదించారు. దీనిపై ఆ శాఖ సానుకూలంగా ఉంది.

సహజ సిద్ధమైన అడవులు

జిల్లాలో సహజ సిద్ధంగానే మడ అడవులు పెరుగుతున్నాయి. సముద్రం అటుపోట్లకు వేళ్లతో కూడిన మొక్కలు కాలువల్లోకి విస్తరిస్తున్నాయి. ప్రధానంగా సముద్రపాయల్లో ఇవి పెరుగుతుంటాయి. దాదాపు ఐదు రకాల వృక్షాలు మడ అడవుల్లో కనిపిస్తుంటాయి. పువ్వులు పూస్తాయి. అక్కడే మొలకెత్తి వేరు వరకు పెరిగే స్వభావం ఈ చెట్లకు ఉంటుంది. కొద్దిపాటి వేరు పెరిగిన తర్వాత పువ్వు తొడిమ నుంచి మొక్క వేరుపడి కింద పడిపోతుంది. నేలను తాకి చెట్టుగా ఎదుగుతుంది. ఒక్కోసారి అటు పోట్లకు వేరేచోటకు వేళ్లతో కూడిన మొక్క పయనిస్తుంది. అక్కడ ఏపుగా పెరుగుతుంది. జిల్లాలో ఇటువంటి సహజ సిద్ధంగా పెరిగే స్వభావం వున్న మడ అడవులు వున్నట్టు అధికారులు గుర్తించారు. ఇటీవల జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు నరసాపురం మండలంలోని మడ అడవులను వీక్షించారు. వీటిని సంరక్షించి పెంపుదల చేయాలనే ఆలోచనతో అధికారులు ముందడుగు వేస్తున్నారు.

మడ అడవుల్లో వివిధ రకాల జీవరాశులు మనుగడ సాగిస్తుంటాయి. చేపలు వేటాడే పిల్లి (ఫిషింగ్ క్యాట్) అందులో ప్రధానమైంది. మడ అడవుల్లోని చెట్లపైనే ఇవి జీవనం సాగిస్తాయి. జనావాసాల్లో ఉండే పిల్లులు కంటే పెద్దవిగా ఉంటాయి. చిరుతల తరహా పెద్ద ఆకారంలోనే ఉంటాయి. పెద్ద పిల్లుల మాదిరి ఉండి చేపల వేట సాగించి పొట్ట నింపుకుంటాయి. సముద్ర తీరంలో ఉండే మడ అడవులే వీటి ఆవాసం. అంతరించిపోతున్న వీటిని సంరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. మడ అడవుల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యంగా జిల్లాలోని మడ అడవుల్లో మాంగ్రూవ్స్ కోబ్రా, పీతలు, నత్తలు, బురద చేపలు, పక్షులు నివసిస్తున్నాయి. ఇలాంటి జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలంటే మడ అడవులను సంరక్షించుకోవాలి. ఆ బాధ్యతను అటవీ శాఖకు అప్పగించేందుకు కసరత్తు జరుగుతోంది.

మడ అడవులతో ప్రయోజనాలెన్నో..

మడ అడవులను పరిరక్షించుకుంటే ప్రయోజనాలు ఎన్నో ఇమిడి ఉన్నాయి. సముద్రంలోని మడ అడవుల్లో ఉప్పు నీటిని తట్టుకునే మొక్కలు పెరుగుతాయి. పర్యావ రణానికి, జలచరాలకు జీవ స్థలాలు. సముద్రం కోతను అరికట్టడానికి ఇవి దోహదపడతాయి. మడల వద్ద సముద్రం ఆటుపోట్లు మెల్లగా ఉంటాయి. నిదానంగా సముద్రపు నీరు పైకి, లోపలకి వెళుతుంది. అక్కడ ఇసుక కంటే బురద ఉంటుంది. ఈ కారణంగా ఉప్పెన వచ్చినా మడ అడవులు రక్షణ కల్పిస్తాయి.

వీడని వాన

- గ్రావెల్, మట్టితో రోడ్లన్నీ బురదమయం
- జారుతున్న బైక్‌లు.. ప్రయాణికుల పాట్లు





ఆచంటలో కురుస్తున్న వాన.. పెనుగొండ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

భీమవరం టౌన్/ఆచంట/ పెనుగొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలో రెండు రోజులుగా నానుడు వర్షాలు కురుస్తున్నాయి. ఇవి సార్వా సాగుకు అనుకూలిస్తాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ సజావుగా లేక రోడ్లపైకి మురుగునీరు పొంగిపొర్లడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రావెల్, మట్టి రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. పెనుగొండ భాష్యం స్కూలుకు వెళ్లే రహదారిపైకి వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వేసవిలో విచ్చలవిడిగా మట్టి తోలకాలతో రోడ్లపై మట్టి పడడంతో వర్షానికి తడిచి చిత్తడిగా మారి మోటారు సైకిళ్లపై వెళ్లే వారు జారిపడుతున్నారు. పెనుగొండ, కొఠాలపర్రు, వడలి, రామన్నపాలెం, ములపర్రు గ్రామాల్లో పలు రహదారులు గోతుల్లో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. గోతుల్లో పడి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లాలో వర్షపాతం వివరాలివి.. పాలకొల్లులో 24.4 మిల్లీమీటర్లు, పాలకోడేరు 18.2, వీరవాసరం 14.4, గణపవరం 14.2, యలమంచిలి 14.2, ఉండి 12.4, పెనుమంట్ర 12.2, పోడూరు 10.4, ఆకివీడు 8, భీమవరం 8, తణుకు 7.4, తాడేపల్లిగూడెం 6.8, ఆచంట 6, పెంటపాడు 4.8, మొగల్తూరు 4.4. ఇరగవరం 4.4, నరసాపురం 3.4, పెనుగొండ 2.8, అత్తిలి 2.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.



వర్షాలకు ప్రత్తిపాడు-రాచర్ల రహదారి ఇలా..

ఈ రోడ్లకు మోక్షమెప్పుడు ?



గోతుల మయంగా నవరసపురం రహదారి

- కొత్త నవరసపురం-మేడపాడు రహదారి అధ్వానం
- ఆయా గ్రామాల ప్రజలకు నరకం

నరసాపురం రూరల్/పెంటపాడు జూలై 25 (ఆంధ్రజ్యోతి):నరసాపురం మండలం కొత్త నవరసపురం నుంచి యలమంచిలి మండలం మేడపాడు వరకు 15 కిలోమీటర్ల మేర రహదారి పెద్ద పెద్ద గోతులతో అధ్వాన్నంగా తయారైంది. దీనిని అభివృద్ధి చేయాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్లతో దీనిని నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. పనులు సకాలంలో మొదలు కాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లి పనులు రద్దయ్యాయి. ఈ కారణంగా ఈ మార్గం గుండా ప్రయాణించాలంటే ప్రజలు రోజూ నరకం చూస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కొద్ది పాటి వర్షాలకే గోతుల్లో నీరు నిండి చెరువులను తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డును అభివృద్ధి చేయాలని నాయకులు, ప్రజా సంఘాలు కానీ ప్రయోజనం లేకపోయింది. రహదారికి వెంబడి ఉన్న కాల్వకు రివిట్‌మెంట్లు నిర్మించారే తప్ప రహదారి మాత్రం పూర్తి చేయలేదు

సీఎం దృష్టికి తీసుకెళ్లా

'ఈ రహదారి సమస్యను ఇటీవల సీఎం చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లా. త్వరలో నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అవి విడుదల కాగానే పనులు చేపడతాం. రోడ్డు సమస్యను పరిష్కరిస్తాం' అని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు చెప్పారు.

ప్రత్తిపాడు-రాచర్ల రోడ్డు దారుణం

పెంటపాడు మండలం ప్రత్తిపాడు ఫుడ్ ప్యాట్ ఫ్యాక్టరీ నుంచి రాచర్ల వెళ్లే రహదారి వర్షాలకు ప్రమాదకరంగా మారింది. దీని నిర్మాణానికి నాబార్డ్ నుంచి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల దశ పూర్తి అయినప్పటికి నిధులు రాకపోవడంతో పనులు మొదలు కాలేదు. ప్రస్తుతం ఈ రహదారిపై ప్రయాణాలు చేయాలంటే భయపడే పరిస్థితి. రోడ్డు మొత్తం గోతులతో మారిపోయింది. ఈ రహదారిపై మిల్లులు, గోదాములు ఎక్కువగా ఉండటంతో లారీలు నిత్యం తిరుగుతూ ఉంటాయి. ఫలితంగా రహదారి రోజురోజుకు మరింత అధ్వాన్నంగా మారింది. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పేదరిక నిర్మూలనకు కలిసి రావాలి

భీమవరం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి):జిల్లాలో పేదరిక నిర్మూలనకు అందరూ కలసి రావాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి కోరారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీరో పావర్టీ పీ 4పై జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ భీమవరం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ నాగరాణి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ మార్గదర్శకుల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. పి ఫోర్ అమల్లో పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. సెక్టార్ల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసి మార్గదర్శకులు ముందుకొచ్చేందుకు దిశా నిర్దేశం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, సీపీవో కె.శ్రీనివాసరావు, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగాని నేడు జిల్లా పర్యటన

నరసాపురం/ఆచంట/మొగల్తూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శనివారం నరసాపురం, ఆచంట నియోజకవరాల్లో పర్యటించనున్నట్లు ఆర్డీవో దాసి రాజు చెప్పారు. ఉదయం 11 గంటలకు మొగల్తూరు మండలం కాళీపట్నంలో సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం అయోధ్యలంక, ఆచంట గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.

మట్టి ఖర్చుల సొమ్ములు జమ

భీమవరం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి):మృతి చెందిన ప్రభుత్వ పెన్షనర్ల మట్టి ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ నెలాఖరు వరకు మృతి చెందిన పెన్షనర్లకు ఈ సొమ్ములు జమ కావడం లేదని ఈ నెల 13న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లాలో 158 మంది ప్రభుత్వ పెన్షనర్ల కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు ఈ మొత్తాలను జమ చేసినట్లు జిల్లా ఖజానా అధికారి అడాది గణేశ్ తెలిపారు.

పరిష్కారం దిశగా..

నరసాపురంలో ఫైర్‌స్టేషన్ మార్పునకు అంగీకారం

- వేరేచోట స్థలం ఇచ్చేందుకు మునిసిపాలిటీ సిద్ధం
- ప్రభుత్వం దృష్టికి ప్రతిపాదన
- ఆడిటోరియం నిర్మాణానికి తొలగుతున్న అడ్డంకులు



నరసాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి):నరసాపురం అగ్నిమాపక కేంద్రానికి స్థలం ఇచ్చేందుకు పురపాలక సంఘం అంగీకరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందు ప్రతిపాదనలు పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో మునిసిపల్ ఓపెన్ థియేటర్ ఖాళీ స్థలంలో రూ.1.70 కోట్లతో ఇండోర్ ఆడిటోరియం పనులు చేపట్టారు. దీనికోసం 40 ఏళ్లుగా ఉంటున్న ఫైర్‌స్టేషన్‌ను ఖాళీ చేయించేందుకు అప్పటి అధికారులు, పాలకులు విశ్వప్రయత్నాలు చేశారు. స్థలం లేకపోవడం, మరోచోట కార్యాలయ ఏర్పాటుకు ఆస్కారం లేకపోవడంతో ఫైర్‌స్టేషన్‌ను తొలగించలేదు. దీంతో అప్పటి పాలకుల సలహాతో ఫైర్‌స్టేషన్ వెనుకభాగాన్ని తొలగించి పనులు చేపట్టారు. రెండేళ్లుగా శిథిలమైన భవనంలోనే ఫైర్‌స్టేషన్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఆడిటోరియం పూర్తి చేయాలంటే ఫైర్‌స్టేషన్‌ను తొలగించాలి. దీంతో పురపాలకం మరోస్థలంలో ఫైర్‌ స్టేషన్‌కు స్థలం కేటాయించేందుకు అంగీకరించింది. జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరావు శుక్రవారం నరసాపురం కమిషనర్ అంజయ్యను కలిశారు. ఫైర్‌స్టేషన్‌కు సంబంధించిన పాత రికార్డులు, కొత్త భవనం నిర్మించేందుకు అవసరమైన స్థల ప్రతిపాదనలను ఆయనకు అందించారు. కమిషనర్ పాలకొల్లు రోడ్‌లోని కొత్తగా నిర్మిస్తున్న అంజనేయస్వామి విగ్రహ సమీపంలో ఆరు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. దీనికి ఫైర్ అధికారులు ఓకే చెప్పారు. ప్రతిపాదనలు ఆర్డీవో దాసి రాజుకు ఇచ్చారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థలం కేటాయింపు పూర్తి కాగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి కొత్త ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అప్పటి వరకు పాత భవనంలోనే కొనసాగిస్తామన్నారు.

అభివృద్ధి అంటేనే చంద్రబాబు

- మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్

ఏలూరు టూటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరు చెబితేనే రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తుకొస్తారని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో 20 వేల కోట్లతో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ సుస్థిర పాలనే ధ్యేయంగా సీఎం పని చేస్తున్నారన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏపీ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి ఫరూక్

ప్లాస్టిక్ భూతం అంతమెప్పుడో

- పట్టణాల్లో యథేచ్ఛగా సింగిల్ యూజ్ కవర్ల వాడకం
- ఎక్కడపడితే అక్కడ విక్రయాలు
- ప్రజలకు తక్షణ సౌకర్యం
- అధికారుల నామమాత్రపు చర్యలు
- నియంత్రణలో యంత్రాంగం విఫలం
- ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడి



6

మాజీ మంత్రి ముందుచూపు

భూమి వినియోగ మార్పిడికి దరఖాస్తు
రెవెన్యూ శాఖ తర్జనభర్జన 6

ఆలయాలకు శ్రావణశోభ

శ్రావణమాసం.. తొలి శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. భీమవరం మావుళ్లమ్మను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.



6

శ్రావణ శోభ

కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



భీమవరం మావుళ్లమ్మను దర్శించుకున్న భక్తులు

భీమవరం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభం కావడంతో అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మావుళ్లమ్మ ఆలయం, సోమేశ్వర, జనార్దనస్వామి ఆలయం, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్లు, శ్రీరాంపురం కనకదుర్గ, పలు వార్డులలో అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు.

ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

పెనుగొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి శుక్రవారం పెనుగొండ వాసవి శాంతి ధామ్ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి గాజుల అలంకరణ

పెనుమంట్ర, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆలయాలు శుక్రవారం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. మార్టేరు శివారు శివరావుపేటలోని కనకదుర్గను మట్టి గాజులతో అలంకరించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ చైర్మన్ తేతలి రాజారెడ్డి ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో గాజులతో అలంకారం చేశారు. పెనుమంట్ర కనకదుర్గమ్మ అమ్మవారికి పంచామృతా లతో అభిషేకాల నిర్వహించి కుంకుమార్చన నిర్వహించారు. మార్టేరు మావుళ్లమ్మ, కామాక్షి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.



ప్రత్యేక అలంకరణలో మార్టేరులో కనకదుర్గమ్మ, పెనుగొండ వాసవీ మాత



కేక్ కట్ చేస్తున్న బిషప్ జయరావు, ఎమ్మెల్యే బడేటి చంటి

జయరావు సేవలు స్ఫూర్తిదాయకం

బిషప్ పదవిలో పన్నెండేళ్లు పూర్తి

ఏలూరుటూటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సామాజిక సేవలో ఆర్‌సీఎం బిషప్ డాక్టర్ జయరావు పొలిమేర కృషి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు కథోలిక పీఠాధిపతి మోస్ట్ రెవరెండ్ డాక్టర్ జయరావు బిషప్‌గా పదవి చేపట్టి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ అభినందించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారధి, ఇడా చైర్మన్ శివప్రసాద్, టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జుంజు మోజేష్, లంకపల్లి మాణిక్యాలరావు, పాల్గొన్నారు. అనంతరం అమలోద్భవి మాత కెథడ్రల్ దేవాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైదరాబాద్ అగ్రపీఠాధిపతి కార్డినల్ ఆంథోని పూల దివ్యబలి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ ఇంజమాల మైఖెల్, పాదర్ కే.బాలరాజు, ఫాదర్ రెవరెండ్ బాల, అబ్రహం మాస్టారు, ఫాదర్ ఇమ్మానియేలు, గురువులు, పీఠాధిపతులు, మఠవాసులు, తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ నజీర్ నుంచి అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త సునీత

మార్టేరు వరి పరిశోధన స్థానం

శాస్త్రవేత్త సునీతకు ఉత్తమ అవార్డు

ఎన్జీ రంగా వర్సిటీ స్నాతకోత్సవంలో ప్రదానం చేసిన గవర్నర్

పెనుమంట్ర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ వరి పరిశోధనా స్థానంలో బ్రీడర్ సైన్స్ విభాగం శాస్త్రవేత్త వై.సునీత ఉత్తమ అవార్డు అందుకున్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూర్ స్వర్ణభారత్ ట్రస్ట్ ఆడిటోరియంలో ఈ నెల 24న జరిగిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ నుంచి డాక్టర్ వై.సునీత అవార్డు అందుకున్నారు. 2011 నుంచి నూతన వరి వంగడాల రూపొందించడంలో విశిష్ట సేవలకు గాను మెరిటోరియస్ రీసెర్చ్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె మార్టేరు (18 రకాలు), బాపట్ల (5 రకాలు) వరి పరిశోధనా స్థానాల నుంచి మొత్తం 23 వరి రకాల అభివృద్ధి, విడుదలలో భాగస్వామి. అదనంగా 1 జన్యు స్టాక్ అభివృద్ధి చేశారు. జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాత జర్నల్స్‌లో 99 పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. 15 మంది పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. 7 పరిశోధనా సంస్థలలో జీవిత కాల సభ్యురాలిగా కొనసాగుతున్నారు. సునీత ప్రస్తుతం మధ్య కాల వ్యవధి కలిగిన వరి రకాల అభివృద్ధిలో పరిశోధనలు చేస్తున్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఆర్ఆర్ఐ), డీబీటీ (బయోటెక్నాలజీ విభాగం) సహకారంతో అనేక ప్రాజెక్టులు చేస్తున్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్, ఇతర శాస్త్రవేత్తలు, సిబ్బంది సునీతకు అభినందనలు తెలిపారు. ఏడీఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, సిబ్బంది మరింత కృషి చేసి మార్టేరు వరి పరిశోధనా సంస్థను ఉన్నత స్థాయిలో నిలపాలన్నారు.

పట్టణాల్లో ప్లాస్టిక్ భూతం

ఆంధ్రజ్యోతి పరిశీలన





పట్టణాల్లో ప్లాస్టిక్ భూతం స్వేచ్ఛగా విహరిస్తోంది. కేన్సర్ రూపంలో ప్రాణాలను కబళించే ప్రమాదం ఉందని తెలిసినా ప్రజలు పట్టించుకోవడం లేదు. అధికారులు అలసత్వం వీడడం లేదు. పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.. అధికారులు వరుస సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గలేదు. వ్యాపారులను విక్రయించవద్దని, ప్రజలను వాడవద్దని అధికారులు చెబుతున్నారు. కవర్లు ఎక్కడ తయారవుతున్నాయి, రవాణా, విక్రయాలపై మాత్రం పర్యవేక్షణ కొరవడింది. ప్లాస్టిక్ నియంత్రణ చర్యలపై ఆంధ్రజ్యోతి పరిశీలన..



- యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్ల వాడకం
- ఎక్కడపడితే అక్కడ విక్రయాలు
- ప్రజలకు తక్షణ సౌకర్యం
- అధికారుల నామమాత్రపు చర్యలు
- నియంత్రణలో యంత్రాంగం విఫలం

నియంత్రణలో విఫలం

పాలకొల్లు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం నియంత్రణలో అధికారుల విఫలమయ్యారు. మునిసిపాలిటీ అధికా రులు కొన్ని రోజులు దుకాణాలపై దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. తర్వాత కవర్ల వినియోగం షరా మామూలే. కొన్ని దుకాణాల్లో కవర్లు ఇవ్వడం లేదని బోర్డులు పెట్టినా వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. దీనితో వ్యాపారులు చాటుమాటుగా కవర్లు ఇస్తూనే ఉన్నారు. కింది స్థాయి అధికారులు ప్లాస్టిక్ వినియోగం నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. ప్లాస్టిక్ కవర్లు ఉత్పత్తిపై చర్యలు లేకుండా వ్యాపారులపై చర్యలు తీసుకోడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

నిషేధం వట్టి మాట!

భీమవరం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి ముప్పుగా ఉన్న ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధం పట్టణంలో వట్టి మాటగా మిగిలింది. దాదాపు 10 నెలలగా నిషేధం అమలులో ఉన్నా పట్టణంలో రోజుకు 80 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణలో ప్లాస్టిక్ కవర్లే అధికం. జిల్లా కేంద్రమైన భీమవరం నుంచే ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలుకు కలెక్టర్ నాగరాణి శ్రీకారం చుట్టారు. మునిసిపల్ అధికారులు దాడులు చేసి వినియోగం, విక్రయాలు కట్టడి చేసినా వాడకం ఆగలేదు. వారం రోజుల క్రితం తోపుడుబండి వ్యాపారి వద్ద జాయింట్ కలెక్టర్ కవర్లను పట్టుకుని అవగాహన కల్పించారు. అనంతరం అధికారులతో సమీక్షలో ప్లాస్టిక్ నియంత్రణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దాడులు నామమాత్రం

తాడేపల్లిగూడెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో ప్లాసిక్ కవర్ల వాడకం సర్వసాధారణం. కూరగాయలు, కిరాణా దుకాణాలు, పండ్ల బండ్లు, పాల బూత్‌ల వద్ద కవర్ల వినియోగం ఎక్కువగా జరుగుతుంది. అధికారులు నామమాత్రపు దాడులతో పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు సాగుతున్నాయి. చిల్లర వ్యాపారులకు కవర్లను విక్రయించే వారిని మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో 20 మైక్రాన్‌కంటే ఎక్కువ మందం ఉండే కవర్లను వినియోగించే అవకాశం ఇచ్చారు. కనీసం ఆదిశగా కూడా వ్యాపారులు చేయడం లేదు. ర్యాలీలు ప్రచారాల ప్రభావం ప్రజలలో కనిపించడం లేదు. అధికారులు దాడులు చేసి అధిక మొత్తంలో ఫైన్లు వేస్తే తప్ప అదుపులోకి రావని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

తనిఖీలతో సరి..!

తణుకు, జూలై 25(ఆంధ్రజ్యోతి):పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గలేదు. తణుకు పట్టణంలో అధికారులు తనిఖీలతో చేతులు దులిపేసుకుంటున్నారు. ఒకటి, అర కేసులు నమోదు చేసి అపరాధ రుసుము విధించినా కవర్ల వాడకం కొనసాగడం అధికారుల చిత్తశుద్ధికి నిదర్శనం.

తరుచూ దాడులు, జరిమానా

నరసాపురం పట్టణంలో సింగిల్ లేయర్ ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించాం, తరుచూ తనిఖీ చేస్తున్నాం. ప్రత్యేక టీం కూడా ఏర్పాటు చేశాం. విక్రయాలు సాగిస్తున్న పలువురు వ్యాపారులకు జరిమానా విధించాం. వ్యాపారులు, ప్రజలకు కవర్ల వాడకంపై అనర్థాలను వివరించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

అంజయ్య, మునిసిపల్ కమిషనర్, నరసాపురం

రూ 3.5 లక్షలు జరిమానా

పట్టణంలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటున్నాం. గత అక్టోబర్ నుంచి ఇప్పటివరకు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వారి నుంచి రూ.3.5 లక్షలు జరిమానా వసూలు చేశాం. ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి దాడులు చేయిస్తున్నాం. వాటిని గుర్తించి చర్యలు చేపడుతున్నాం. వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలకు తెలిసేలా ప్రచారం చేస్తున్నాం.

కె.రామచంద్రారెడ్డి, భీమవరం మునిసిపల్ కమిషనర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పర్యావరణంపై దుష్ప్రభావం చూపే ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించాలి, ప్లాస్టిక్‌తో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది., దీనితో గుడ్డ సంచులువాడితే చాలా మేలు. సామాజిక మాధ్యమాల ద్వారా పేపర్లు, టీవీల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి.

మీసాల రాజేంద్ర, పాలకొల్లు

అందరూ సహకరించాలి



ప్లాస్టిక్ కవర్లు వినియోగం ప్రజలు, పర్యావరణానికి హాని కలిగిస్తుంది. కవర్ల వాడకం కాకుండా ప్రత్యామ్నాయ సంచుల వినియోగంతో ప్రతి ఒక్కరు సహకరించాలి. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం, అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు ప్రజలు తోడుగా నిలబడాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రజలు అందరూ సహకరించాలి.

వెంకటేశ్వరరావు, తణుకు

తనిఖీలు ముమ్మరం చేయాలి



ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలి. మూడు నెలలు నుంచి అధికారులు తనిఖీలు చేయడంతో పాటు వాటిని విక్రయిస్తున్న వ్యాపారులకు జరిమానా విధిస్తున్నారు. అయినప్పటికి కవర్లు వాడకం మానలేదు. వ్యాపార సంస్థలకు గట్టి ఆదేశాలతో పాటు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

మొనవర్తి వెంకటేశ్వరరావు, తణుకు

అవగాహన కల్పించాలి



సరుకులు తీసుకెళ్లేందుకు ప్రత్నామ్నాయం లేకపోవడంతో కవర్లను వినియోగిస్తున్నాం. చాలా కాలం నుంచి అలవాటుగా మారింది. దీనివల్ల కలిగే అనార్థలపై ప్రజలకు ఇప్పుడిప్పుడు అవగాహన కలుగుతుంది. అధికారులు విస్తృతంగా సదస్సులు నిర్వహించాలి. అవగాహన కల్పించడం ద్వారా వినియోగం తగ్గుతుంది.

చెరుకూరి బాలాజీ, నరసాపురం

చెక్ డ్యాం కొట్టుకుపోయింది

ఐదేళ్లుగా పట్టించుకోలేదు!

- తమ్మిలేరుపై వెంకటాపురం వద్ద 2020 వరదకు చెక్‌డ్యామ్ ధ్వంసం
- మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లిన రైతులు
- నిర్మాణానికి హామీ
- మంజూరు కాని నిధులు



వెంకటాపురం వద్ద తమ్మిలేరులో కొట్టుపోయిన చెక్ డ్యామ్

ముసునూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం వెంకటాపురం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన చెక్‌డ్యామ్ 2020లో వరదలకు కొట్టుకుపోయింది. ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదు. చెక్‌డ్యామ్ వల్ల బలివే, వెంకటాపురం, వేల్పుచర్ల గ్రామాల పరిధిలో సూమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందేది. గత ఏడాది చెక్‌డ్యామ్ నిర్మాణం చేపడతామని అన్ని రాజకీయ పార్టీలు హామీలు నీటి మూటలే. చెక్‌డ్యామ్ వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భ జలనీటి మట్టం పెరుగుతుంది. తద్వారా వ్యవసాయ బోరుల్లో సైతం నీటి మట్టం పెరిగి ప్రజల వ్యవసాయ అవసరాలు తీరాయి. తొలుత 2009లో రూ.6 కోట్లతో చెక్‌ డ్యామ్ నిర్మించగా 2020 వరదలకు కొట్టుకుపోయింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం దీని వైపు కన్నెత్తి చూడలేదు. నాటి నుంచి పంటలకు సకాలంలో నీరు అందక రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

నిధులు మంజూరు చేయండి..

2024 ఎన్నికల్లో నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి చెక్‌డ్యామ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారంలోకి రాగానే నిర్మిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఎన్నికల వేళ తాను ఇచ్చిన హామీని అమలు చేయడానికి మంత్రి సంబంధిత అధికారులను పంపి ప్రతిపాదనలు రూపొందించి సుమారు 8నెలలైంది. ఇంత వరకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చెక్‌డ్యామ్‌ను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి పార్థసారథి ఆదేశాలతో కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను పరిశీలించినట్లు నూజివీడు ఇరిగేషన్ డీఈ వై.అర్జునరావు తెలిపారు. చెక్ డ్యామ్ నిర్మాణానికి సూమారు రూ.3.5కోట్లు అవసరమని ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు.



బీడువారిన భూములు


వేల్పుచర్లలో 7 చెరువులకు ఈ చెక్‌డ్యామ్ నుంచి సప్లైయి ఛానల్ ద్వారా చేరిన నీటితో పంటలు పండేవి. చెక్‌డ్యామ్ కొట్టుపోయిన నాటి నుంచి సుమారు 700 ఎకరాలు పంట పొలాలు బీడు భూములుగా మారాయి. ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణానికి చర్యలు చేపట్టి, రైతులకు మేలు చేయాలి

తుమ్మల నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు, వేల్పుచర్ల

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం

వైసీపీ హయాంలో వరదలకు చెక్‌డ్యామ్ కొట్టుపోయింది. ఐదేళ్ల నిర్లక్ష్య పాలన రైతులకు శాపంగా మారింది. ఈ చెక్‌ డ్యామ్ నుంచి సుమారు 700 ఎకరాల్లో పంటలు పుష్కలంగా పండేవి. ప్రస్తుతం వర్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టాలి.

కాట్రు రామస్వామి, రైతు, బలివే



మాజీ మంత్రి ముందు చూపు!

భూమి వినియోగ మార్పిడికి దరఖాస్తు

రెవెన్యూ శాఖ తర్జనభర్జన


(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయ ప్రతిపాదనల నేపథ్యంలో వైసీపీకి చెందిన మాజీమంత్రి ముందస్తు వ్యూహం రచించారు. వెంకట్రామన్నగూడెం ప్రాంతంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి వినియోగ మార్పిడి (కన్వర్షన్)కి దరఖాస్తు చేశారు. దీనిపై రెవెన్యూ శాఖ తర్జన భర్జన పడుతోంది. ఇటీవల భూ వినియోగ మార్పిడి దరఖాస్తులు తగ్గిపోయాయి. కన్వర్షన్ ఫీజు రద్దు ప్రకటనలతో ఎవరూ దరఖాస్తు చేయడం లేదు. క్షేత్రస్థాయిలో మెరకచేసి లేఅవుట్ వేసేందుకు సిద్ధమవుతున్నా రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోలేకపోతోంది. ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్న ఉద్దేశంతో రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోతున్నారు. జిల్లాకు చెందిన మాజీమంత్రి మాత్రం వెంకట్రామన్నగూడెం ప్రాంతంలో భూమి కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. విమానాశ్రయం వస్తే చదరపు గజాల రూపంలో పరిహారం తీసుకోవడానికి ఇది ఒక ఎత్తుగడ అని జిల్లాలో చర్చ జరుగుతోంది.

నిర్మాణాలుంటేనే గజాల్లో..

ప్రస్తుతం తాడేపల్లిగూడెం విమానాశ్రయ జాబితాలో ఉంది. భూసేకరణపై ఇటీవల కలెక్టర్ తాడేపల్లిగూడెం రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. భూములు అందుబాటులో ఉన్నాయని జిల్లా అధికారులు ప్రభు త్వానికి నివేదిక సమర్పించిన తర్వాత ఫీజిబిలిటీ కమిటీ సర్వే నిర్వహించి కేంద్రానికి నివేదిక ఇస్తుంది. ప్రయాణికులతో పాటు, కార్గోకు ఇక్కడ అవకాశాలు మెండుగా ఉన్నాయి. పరిహారం విషయంలో రైతుల్లో అలజడి నెలకొంది. రైతులు ఆశించిన విధంగానే పరిహారం ఉంటుందని ఎమ్మెల్యే బొలిశెట్టి భరోసా ఇస్తున్నారు. కాగా మాజీమంత్రి భూమి కన్వర్షన్ దరఖాస్తు అందరిలో ఆసక్తి రేపింది. గజాల్లో పరిహారం సాధించేందుకు మాజీమంత్రి ఎత్తుగడ వేశారంటూ బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. నిర్మాణాలకు మాత్రమే గజాల్లో పరిహారం ఉంటుంది. లేదంటే వ్యవసాయ భూముల తరహాలోనే సేకరిస్తారు.

ద్వారకాతిరుమల సమాచారం



పవిత్రాలు ధరించిన స్వామి, అమ్మవార్లు

వచ్చే నెల 7 నుంచి 10 వరకు

శ్రీవారి పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, జూలై 25(ఆంధ్రజ్యోతి):చిన్న వెంకన్న దివ్యపవిత్రోత్సవాలు వచ్చే నెల ఏడో తేదీ నుంచి 10 వరకు జరుగుతాయని ఆలయ ఈవో ఎన్‌వీ సత్య నారాయణ మూర్తి తెలిపారు. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ఏటా వీటిని నిర్వహిస్తారు. 7న సాయంత్రం అంకురార్పణ, 8న పవిత్రాధి వాసం, 9న పవిత్రారోపణ, 10న మహా పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. ఆయా రోజుల్లో శ్రీవారి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో వివరించారు.

శని, ఆదివారాల్లో నిత్య కార్యక్రమాలు

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని, ఆదివారాల్లో నిత్య కార్యక్రమ వివరాలు..

- ఉదయం 3.30 గంటలకు తీర్థపు బిందె సేవ
- 4 గంటలకు సుప్రభాత సేవ
- 4.30 గంటలకు ప్రాతః కాలార్చన, బాలభోగం, గోష్ఠి
- 5.30 గంటల నుంచి సర్వదర్శనం
- 7 గంటల నుంచి ఆర్జిత పూజలు
- 8.30 ఆర్జిత బ్రహ్మోత్సవం
- 9.30 గంటలకు నిత్యార్జిత కల్యాణం
- మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన
- 3 గంటల నుంచి పభుత్వోత్సవం.
- సాయంత్రం 5.30 గంటల వరకూ సర్వదర్శనం
- 5.30-7.00 మధ్య సాయం కాలార్చన (దర్శన విరామం)
- 7.00-8.30 గంటల వరకూ సర్వదర్శనం.
- 8.30-8.40 వరకూ సేవాకాలం.
- రాత్రి 9.00 గంటలకు ఏకాంతసేవ (పవళింపు సేవ) అనంతరం ఆలయ తలుపులు మూసివేస్తారు.

వసతి వివరాలకు..

- ఆలయం వద్ద వసతి సౌకర్యం కోసం సీఆర్‌వో కార్యాలయం నంబర్లు 90375 69891, 90375 67892లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.



ఎలక్ట్రానిక్ తూకం మోసాలను వివరిస్తున్న గాంధీభగవాన్‌రాజు

రొయ్యల తూకంలో మోసం

ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ కాటాపై రొయ్యల తూకంలో రైతులను ఏజెంట్లు మోసగిస్తున్నారని జై భారత్ క్షీరారామ ఆక్వా సంఘం చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అన్నారు. సంఘ భవనంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెంట్లు ఎలక్ట్రానిక్ కాటా ఆప్షన్లు మార్చి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కిలోకి సుమారు 60 గ్రాములు టన్నుకు 50 కిలోలకు పైబడి రొయ్యలను రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఆక్వా సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ కాటాలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. తూకాల్లో ఏజెంట్లు చేసే మోసాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఏజెంట్లు కాటాల ఆప్షన్లు మార్చుతున్న తీరు ఆయన వివరించారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బోనం చినబాబు, పెన్మెత్స సత్యనారాయణరాజు, మేడిద జాన్‌రాజు, అంగర వర ప్రసాద్, దాట్ల సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ పట్టభద్రులకు విదేశీ ఉద్యోగావకాశాలు

అభ్యర్థులకు జర్మనీ భాషపై ఎస్సీ సంక్షేమ శాఖ శిక్షణ

ఏలూరు రూరల్/భీమవరం టౌన్, జూలై 25, (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ డిగ్రీ పూర్తిచేసిన ఎస్సీ, ఎస్టీ మహిళలకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు. అభ్యర్థులకు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ పశ్చిమ, ఏలూరు జిల్లాల డీడీలు వై.విశ్వమోహన్‌రెడ్డి, రామాంజనేయురాజు తెలిపారు. శుక్రవారం వారు ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం కలిగి ఉండాలన్నారు. లేదా జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి మూడేళ్ల క్లినికల్ అనుభవం కలిగి ఉండాలన్నారు. అభ్యర్థినులకు 35 ఏళ్ల వయస్సు మించరాదన్నారు. ఆసక్తి గల అభ్యర్థనులు ఈ నెల 29 తేదీలోపు ఏలూరు అమీనా పేట బాలయోగి సైన్స్ పార్క్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ సాధికారిత కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. తిరుపతి, గుంటూరు లేదా విశాఖపట్నంలో జర్మన్ భాషపై 8 నెలలు శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు ఏలూరు జిల్లాలో 9704782803, పశ్చిమగోదావరి జిల్లాల వారు 94922 03165, 83098 67414 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.


అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను పరిశీలిస్తున్న ఏలూరు ఎస్పీ కిశోర్

అధిక శబ్దం వచ్చే సైలెన్సర్ల ధ్వంసం

ఏలూరు క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను తొలగించి వాటిని ధ్వంసం చేసినట్లు ఎస్పీ కేపీఎస్.కిశోర్ తెలిపారు. ఏలూరులో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తొలగించిన సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీ కిశోర్ సమక్షంలో రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ద్విచక్ర వాహనాలకు సంబంధిత కంపెనీలు ఇచ్చిన సైలెన్సర్లు కాకుండా ఎక్కువ శబ్దం వచ్చే వాటిని బిగించుకుని శబ్ద కాలుష్యం సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు తయారు చేసే కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

నంబర్ ప్లేట్‌పై స్టిక్కర్లు ఉంటే వాహనం సీజ్

కొంతమంది నంబర్ ప్లేట్లపై స్టిక్కర్లు అంటిస్తున్నారని అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండాలన్నారు. పిల్లల సౌకర్యం కోసం తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను కొనిస్తున్నారని, వాటి ద్వారా సమస్యలను కూడా కొని తెచ్చుకోవద్దన్నారు. హైస్పీడు వాహనాలను పిల్లలకు ఇవ్వరాదని ఎస్పీ కిశోర్ సూచిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులతో పాటు తల్లి దండ్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏలూరు త్రి టౌన్ సీఐ వి కోటేశ్వరరావు, టూటౌన్ సీఐ కె అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ లక్ష్మణబాబు, ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ పలువురు పాల్గొన్నారు.


జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శిథిల భవనాలను తొలగిస్తున్న దృశ్యం

భవనాల కొరత తీరేలా..

- తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కొత్త భవనాలు
- శిథిల భవనాల తొలగింపు పనులు
- ఎమ్మెల్యే ఆరిమిల్లి చొరవతో రూ. 20 కోట్లు మంజూరు

తణుకు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో కొత్త భవనాలు నిర్మాణానికి రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. భవనాలు కొరత, ఆసుపత్రిలో ప్రజలకు సౌకర్యాలు కల్పనకు అవసరమైన భవనాలు అందుబాటులో లేవని వైద్యులు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు విన్నవించడంతో ఆయన ఆసుపత్రి ప్రాంగణంలోనే శిథిల భవనాలు స్థానే కొత్త భవనాలు నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణకు కృషి చేశారు. 17వ ఆర్థిక సంఘం నుంచి నిధులు మంజూరు చేయించారు.

శిథిల భవనాల తొలగింపు

ఆసుపత్రిలో భవనాల కొరత ఉంది. కానీ వాటిని నిర్మించడానికి అనువైన స్థలం అందు బాటులో లేదు. ఎటు చూసిన సమస్య పరిష్కా రం అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఆసుపత్రిలో మాత్రం కనీసం వైద్యులకు అవసర మున్న గదులు లేక, రోగులకు కల్పించే సౌకర్యాలు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆసుపత్రి ప్రాంగ ణంలోనే ఉన్న సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు నివాస సముదాయాలు శిథిలావస్థకు చేరడంతో చాలా కాలంగా నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని తొలగించి కొత్త భవనాలు నిర్మించాలని బావించారు. దీంతో ప్రస్తుతం శిథిల భవనాలు తొలగింపు కార్యక్రమం చేపట్టడం జరిగింది. కొత్త భవనాలు నిర్మించడ ద్వారా చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుందని బావిస్తున్నారు.

> **చాలా వరకు సమస్య పరిష్కారం**
>
> 
>
> పాత భవనాలు తొలగించి కొత్త భవనాలు నిర్మించడం వల్ల చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుంది. ఆసుపత్రిలో భవనాల కొరతను తీర్చాలనే పట్టుదలతో ఎమ్మెల్యే ఉన్నారు. ముందుగా పాత భవనాలు తొలగిస్తున్నాం. ఆ స్థలాన్ని బట్టి కొత్త భవనాలు నిర్మిస్తాం.
>
> **సాయి కిరణ్, తణుకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్**


మూర్ఛ వ్యాధిపై ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పశ్చిమలోని 23 గ్రామాల్లో

మూర్ఛపై విస్తృత పరిశోధన

ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీరావు

భీమవరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అంతర్జాతీయ ఆరోగ్య పరిశోధనా సంస్థ జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్, ఎయిమ్స్ ఢిల్లీ, పంజాబ్ దయానంద మెడికల్ కాలేజీ భాగస్వామ్యంతో మూర్ఛ (ఎపిలెప్సీ) వ్యాధిపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్టు ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీరావు తెలిపారు. భీమవరంలో నిర్వహించిన ఆశా వర్కర్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ పరిశోధనను పశ్చిమ గోదావరి జిల్లాలోని 14 పీహెచ్‌సీలకు చెందిన 23 గ్రామాల్లో కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిశోధనలో భాగంగా జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహకారంతో మూర్ఛవ్యాధిపై 23 గ్రామాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, మూర్ఛను గుర్తించడం ఎలా, ఈ వ్యాధిగ్రస్తులకు వారి కుటుంబ సభ్యులు సరైన మద్దతు ఎలా ఇవ్వాలో.. అలాగే ఈ వ్యాధికి సంబంధించి సామాజిక అపోహలు ఎలా తొలగించాలో వివరంగా చర్చించామన్నారు. మూర్ఛ ఉన్న వ్యక్తుల చదువు, ఉద్యోగం, వివాహం, గర్భధారణ, ప్రసవం, పిల్లల పోషణ, మెనోపాజ్, వాహనాలు నడపటం ఇంకా అనేక దినచర్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దయానంద మెడికల్ కళాశాల యూరాలజీ విభాగం ప్రొఫెసర్ గగన్‌దీప్ సింగ్, హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సీతా జయలక్ష్మి, డాక్టర్ ఉష, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టాలను అందిస్తున్న నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్

సృజనాత్మకతతో వృద్ధి సాధించండి

నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీ స్వామి

ఏలూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇతరుల సహాయం కోసం ఎదురుచూడకుండా తమకు తామే సృజనాత్మకతతో ఉద్యోగ, వ్యాపార అవకాశాలను పట్టభద్రులైన విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆదికవి నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.స్వామి సూచించారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో గత విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో యూనివర్సిటీ పరిధిలో స్వర్ణ, రజిత పతకాలు సాధించిన 8 మంది టాపర్లను అబినందించడంతోపాటు, ఆయా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థినులకు శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలను అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ కరస్పాండెంట్, మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాల ప్రారంభోత్సవానికి రానున్న సీఎం?

నన్నయ వర్సిటీలో నిర్మించిన ఇంజనీరింగ్ కళాశాల, పురుషుల వసతి గృహం, ఇతర విభాగాల భవనాల ప్రారంభోత్సవం ఆగస్టులో జరుగనుందని, కార్యక్రమానికి సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రిని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని రిజిస్ట్రార్ వెల్లడించారు. కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి వర్సిటీలో బీటెక్ కోర్సును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌లలో ప్రారంభించనున్నామన్నారు. కొద్దినెలల్లోనే ఆటోమేషన్ విధానాన్ని పరీక్షల విభాగంలో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. గిరిజన విద్యార్థుల కోసం పాడేరులో వర్సిటీ క్యాంపస్‌ను ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో బీటెక్, బీ-ఫార్మసీ కోర్సులను ఈ ఏడాది నుంచి ప్రారంబిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి రూ.20 కోట్లు మంజూరయ్యాయన్నారు.

అమలాపురం బస్సుల దారి మళ్లింపు

- చించినాడ వరకు కొన్ని సర్వీసులు
- బ్రిడ్జి మరమ్మతులు పూర్తయ్యే వరకు ఇంతే

భీమవరం టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): చించినాడ బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో అమలాపురం సర్వీసులను కొనసాగించేందుకు ఆర్టీసి అధికారులు రూట్ మార్చి పంపుతున్నారు. కొన్ని సర్వీసులను భీమవరం నుంచి అమలాపురం (వయా) పాలకొల్లు, రావులపాలెం, కొత్తపేట, అంబాజీపేట మీదుగా భీమవరం బస్ కాంప్లెక్స్ నుంచి ప్రతి గంటా 15 నిమిషాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడిపేలా ఏర్పాటుచేశారు. రాజోలు, తదితర ప్రాంతాలకువెళ్ళే ప్రయాణికుల కోసం భీమవరం బస్ కాంప్లెక్స్ నుంచి చించినాడ బ్రిడ్జి వరకు వయా పాలకొల్లు మీదుగా ప్రతి గంటకు ఒక బస్సును ఏర్పాటు చేశారు. అలాగే అటువైపు దిండి చెక్ పోస్టు నుంచి అమలాపురానికి వయా రాజోలు మీదుగా ప్రతి గంటకు బస్సు సర్వీసు ఏర్పాటుచేశారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసి ప్రజా రవాణాధికారి ప్రసాదరావు కోరారు.

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం ఆర్టీసీ డిపోలో రోజు వారి వేతనంతో ఔట్ సోర్సింగ్ విధానంలో డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు భీమవరం అసిస్టెంట్ మేనేజర్ సురేష్ తెలిపారు. ఎటువంటి యాక్సిడెంట్ లేనట్లుగా ఎంవీఐ ఇచ్చే ధ్రువపత్రం, ఆధార్ కార్డు, హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో డిపో మేనేజర్ కార్యాలయానికి రావాలని, రికార్డుల పరిశీలన అనంతరం మెడికల్ పరీక్షలు, శిక్షణ అనంతరం ఎంపికైన అభ్యర్థులను రోజువారీ వేతనం చెల్లించే విధంగా నియమిస్తామని తెలిపారు. దరఖాస్తులను భీమవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలో 30వ తేదీ లోపు ఇవ్వాలని తెలిపారు. ఇతర వివరాలకు 83415 43351 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

27న ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి

కంప్యూటర్ ఆధారిత పరీక్ష

ఏలూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జోన్-2 పరిధిలోని ఉభయగోదావరి జిల్లాల్లోని ఎయిడెడ్ పాఠశాలల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్టు)ని ఈ నెల 27న ఉదయం 9.30 నుంచి 11.30 గంటలవరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్టు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (కాకినాడ ఆర్జేడీ) జి.నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి, కొంతమూరు ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి కాకినాడ అచ్యుతాపురం, రాజమండ్రి లూథర్‌గిరిలలోని అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించినట్టు వివరించారు. ఈ కేంద్రాల పరీక్షార్థులు ఏవైనా సందేహాలుంటే 98485-74622, 83091-77952 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ ఎస్వీకేపీ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల, దంతులూరి నారాయణరాజు అటానమస్ కళాశాల, ఎస్.ఆర్.కే.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాల, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో సీబీటీ పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులకు సందేహాలుంటే 99892-71919 నంబరులో సంప్రదించాలని కోరారు. హాల్ టిక్కెట్లను సీఎస్ఈ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్ష ప్రారంభ సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోరని స్పష్టం చేశారు. హాల్ టిక్కెట్‌తోపాటు, ఏదైనా ఫొటో గుర్తింపు కార్డుతో సహా పరీక్ష కేంద్రానికి గంటన్నర ముందుగా హాజరుకావాలని కోరారు.

క్రైం సమాచారం

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే హెచ్‌సీ ఎంఎస్ఎన్ ప్రసాద్ తన సిబ్బందితో శుక్రవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 35 ఏళ్ల వయస్సు కల్గి 5.5 అడుగుల ఎత్తు, చామన చాయశరీరంతో సామాన్య దేహధారుడ్యంతో ఉన్నాడు. మృతుడు తెలుపు, నలుపు సిమెంటు రంగులతో కూడిన అడ్డ చారల పొట్టిచేతుల చొక్కా, టీ షర్టు, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని కుడిచేయి మణికట్టుపైన త్రిశూలం గుర్తు కల్గిన పచ్చబొట్టు ఉంది. రైలు నుంచి జారి పడ్డాడా, రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలిసిన వారు 99891 09912 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

అప్పుల బాధతో అర్చకుడి ఆత్మహత్య

ఉంగుటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): రాచూరు పల్లాలమ్మ ఆలయ అర్చకుడిగా పనిచేస్తున్న రుద్రపాక లీలా శివకుమార్(53) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. రాచూరు పల్లాలమ్మ ఆలయ అర్చకుడిగా పనిచేస్తున్న శివ కుమార్ ఇటీవల కాలంలో సుమారు రూ.20 లక్షలు అప్పు చేసి అవి తీర్చలేక ఆవేదన చెందుతున్నట్లు కుటుంబ సభ్యుల వద్ద తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉంగుటూరు సోషల్ ఫారెస్ట్ సమీపంలో పురుగులమందు తాగి పడిఉన్నట్టు స్థానికులు గమనించి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య కళ్యాణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె దుర్గాసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

యువతిని మోసగించిన కేసులో యువకుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా

ఏలూరు క్రైం/జంగారెడ్డిగూడెం,జూలై 25(ఆంధ్రజ్యోతి): ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించిన ఘటనపై నేరం రుజువు కావడంతో ఆ యువకుడికి ఏడాది జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం తీర్పు చెప్పారు. జంగారెడ్డిగూడెంలోని ఒక వస్త్రాల దుకాణంలో పనిచేస్తున్న యువతికి జంగారెడ్డిగూడెంకు చెందిన సారంపాటి రాజేష్ ఆ యువతితో పరిచయం చేసుకున్నాడు. ప్రేమిస్తున్నానని పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసగించి, పెళ్ళికి నిరాకరించాడు. ఆ బాధితురాలు 2021లో జంగారెడ్డిగూడెం పోలీసు లకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ ఎం.సాగర్‌బాబు కేసు నమోదు చేశారు. అప్పటి చింతలపూడి సీఐ ఇన్‌ఛార్జి, జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీవీఎస్ మల్లేశ్వరరావు రాజేష్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణలో నిందితుడైన రాజేష్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా సొమ్మును బాధితురాలికి ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

మహిళ ప్రాణాలు కాపాడిన కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ మహిళను కొవ్వూరు పట్టణ పోలీసులు రక్షించారు. వివరాలివి.. కొయ్యలగూడెం మండలానికి చెందిన ఓ మహిళ కుటుంబ సమస్యలతో గొడవ జరిగి శుక్రవారం కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెన పైనుంచి గోదాట్లోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి నడిచి వెళ్తోంది. కాగా, అదే సమయంలో ఆటోలో అటుగా వెళ్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి గమనించి 112 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్పీ డీ.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పి.విశ్వం, హెచ్‌సీ ఎంవీవీ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, పట్టణ పోలీసులను ఎస్పీ అభినందనలు తెలిపారు.



రోడ్డు పక్కకు వెళ్లిన బస్సు
వ్యాన్ నుంచి చెల్లాచెదురైన ఉల్లి, అల్లం, బంగాళదుంపలు

మినీ వ్యాన్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఏలూరు క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి):వర్షం కారణంగా ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న ఒక మినీ వ్యాన్‌ను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో బస్సు డ్రైవర్‌కు, మినీ వ్యాన్‌లో ఉన్న ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు అదుపుతప్పి రోడ్డు దిగువ భాగానికి వెళ్లిపోయింది. కాకినాడ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు కాకినాడ నుంచి విజయవాడకు శుక్రవారం మధ్యాహ్నం బయలుదేరింది. తాడేపల్లిగూడెం నుంచి ఉల్లిపాయలు, అల్లం, ఇతర సరుకుల లోడుతో మినీ వ్యానును బయలుదేరి ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం గ్రామానికి వెళ్తుంది. మార్గమధ్యలో 16వ నంబరు హైవే ఏలూరు జిల్లా ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బ్రిడ్జి వద్ద వెనుకనుంచి ఆర్టీసీ బస్సు ఢీకొని అదుపుతప్పి రోడ్డు దిగువ భాగానికి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ కాకినాడకు చెందిన వరిపిల్లి రవి, వ్యానులో ఉన్న సరుకు యజమాని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడానికి చెందిన కోరా శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిద్దరిని హైవే పెట్రోలింగ్ పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న ఏలూరు త్రీటౌన్ ఎస్ఐ రాంబాబు హైవే పెట్రోలింగ్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేశారు. ఈఘటనపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బుల దొంగ అరెస్ట్.. రూ. 3 లక్షలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పార్క్ చేసిన ద్విచక్ర వాహనాల్లోని డిక్కీలో డబ్బులు దొంగతనం చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 4వ తేదీన భీమవరం పట్టణ పరిధిలో కళాభవనం వారి వీధికి చెందిన ఎం.రమేష్ బాబు తన వ్యాపారం నిమిత్తం మోటార్ సైకిల్ డిక్కీలో రూ.3లక్షలు పెట్టాడు. బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి డిక్కీలో ఉన్న రూ.3 లక్షల నగదు కనిపించలేదు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.నాగరాజు, ఎస్ఐలు కిరణ్‌కుమార్, వీర్రాజు వారి సిబ్బందిని టీమ్‌లుగా ఏర్పాటు చేసి సెల్ లొకేషన్ ద్వారా ఇద్దరిని గుర్తించారు. ఈనెల 9వ తేదీన విజయనగరం జిల్లా కొత్తవలస మండలం, సుందరయ్యపేట గ్రామానికి చెందిన మేకల బాలరాజును అరెస్ట్ చేశారు. మరో ముద్దాయి అయిన ఒడిశా రాష్ట్రానికి చెందిన దాసు రబీ (రవి)ని ఈనెల 25వ తేదీన అరెస్ట్ చేసి అతడి వద్ద రూ. 3 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కేసును దర్యాప్తు చేసిన కె.నాగరాజును, ఎస్ఐలు కిరణ్‌కుమార్, వీర్రాజు, క్రైం సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.


అగ్ని ప్రమాదం తరువాత కార్యాలయం.. దగ్ధమైన ల్యాప్‌టాప్

మునిసిపల్ కమిషనర్ చాంబర్‌లో అగ్నిప్రమాదం

- దగ్ధమైన కంప్యూటర్, ఏసీ, ఫ్యాన్‌లు, లైట్లు
- విలువైన డాక్యుమెంట్స్‌కు నష్టం లేదు : కమిషనర్

జంగారెడ్డిగూడెం,జూలై25(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం మునిసిపల్ కమిషనర్ చాంబర్ రూమ్‌లో గురువారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదం జరిగింది. గదిలో ఉన్న కంప్యూటర్, ఏసీ, సీసీ కెమేరాల మోనిటర్, మూడు ఫ్యాన్‌లు, మూడు ట్యూబ్ లైట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ల్యాప్‌లాప్, ఆఫీస్ టేబుల్, కుర్చీ పాక్షికంగా దగ్ధమయ్యాయి. గదిలో మంటలు బాగా వ్యాపించడంతో గోడలన్నీ నల్లగా మారిపోయాయి. ఈ సందర్భంగా కమిషనర్ కేవీ రమణ మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి సమయంలో తన చాంబర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగిందని వాచ్‌మన్ ఫోన్ చేయగా వెంటనే వెళ్లి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపు చేసినట్టు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు మూడు లక్షలు ఆస్తి నష్టం జరిగిందని, ఎటువంటి విలువైన పత్రాలు చాంబర్‌లో లేవని, విలువైన డాక్యుమెంట్స్‌కు నష్టం జరగలేదన్నారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారన్నారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలో చిన్నారి అదృశ్యం

రెండు గంటల్లో తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

పెంటపాడు, జూలై25(ఆంధ్రజ్యోతి):పోలీస్‌స్టేషన్ వద్ద అదృశ్యమైన చిన్నారిని పోలీసులు రెండు గంటల వ్యవధిలో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన పెంటపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. రాచర్ల గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి కొడవల్లూరి దుష్యంత్‌సూర్య తల్లిదండ్రులు ఓ పని నిమిత్తం కారులో చిన్నారని పెట్టి పెంటపాడు పోలీస్‌స్టేషన్ వచ్చారు. కారు అద్దం తెరిచి ఉండడంతో చిన్నారి బయటకు వచ్చి తిరగడాన్ని గమనించిన కె.పెంటపాడు వాసి ఊరిలో చెప్పి బాలుడి తల్లిదండ్రులకు అప్పగించాలన్న ఉద్దేశంతో ఇంటికి తీసుకెళ్లాడు. పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు కారులో చిన్నారి లేకపోవడాన్ని గమనించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ స్వామి సిబ్బందితో టీంలుగా విడిపోయి గాలించేసరికి కె.పెంటపాడులో బాలుడు కనిపించడంతో తల్లిదండ్రులకు అప్పగించారు.

నగదు దొంగతనం కేసులో ఒకరికి ఏడు నెలల జైలు

భీమవరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పార్క్ చేసిన ద్విచక్ర వాహనం డిక్కీలోని నగదు, సెల్‌ఫోను దొంగిలించిన కేసులో ఓ వ్యక్తికి కోర్టు ఏడు నెలల జైలు శిక్ష విధించింది. రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన ఉప్పల రాము ఈ ఏడాది జనవరి ఒకటిన భార్యతో సహా గుడికి వెళ్లారు. బైక్ పార్క్ చేసి లోపలికి వెళ్లి వచ్చేసరికి డిక్కీలో ఉన్న రూ.15వేల నగదు, సెల్‌ఫోన్ కనిపించలేదు. ఈమేరకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు భీమవరం మండలం నరసింహపురం గ్రామానికి చెందిన మధురా వెంకన్న అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసును శుక్రవారం విచారణ చేసిన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు వెంకన్నపై నేరం రుజువు కావడంతో ఏడు నెలల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ వీర్రాజు తెలిపారు. అలాగే కొవ్వాడ అన్నవరానికి చెందిన యర్రంశెట్టి విజయరామారావు చెరువుపై ఈ ఏడాది మార్చిలో మూడు మోటార్లు చోరీకి గురైన ఘటనలో భీమవరం మండలం అనాకోడేరుకు చెందిన నేపాల సూర్యారావు అనే వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారని ఎస్ఐ వీర్రాజు తెలిపారు.

ఏడుగురు కార్యదర్శులు బాధ్యతల స్వీకరణ

నరసాపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు గ్రామాల్లో కొత్త కార్యదర్శులు బాధ్యతలు చేపట్టినట్లు ఈవోపీఆర్డీ నాగేంద్రకుమార్ తెలిపారు. దర్బరేవుకు పి.రవికుమార్, గొందికి సురేష్, కె బేతపూడికి గణేష్, రుస్తుంబాదాకు శేఖర్‌బాబు, వైఎస్‌పాలెంకు రాజు, సీతారాంపురం నార్త్‌కు కె సూర్యనారాయణ, చామకూరిపాలెంకు ప్రతిభలు బాధ్యతలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

శ్రావణ సోమవారాల్లో మల్లికార్జునుడికి గోదావరి జలాల అభిషేకం

మొగల్తూరు, జూలై 25: వడయార్ పేటలోని వనమల్లికార్జునుడకి శ్రావణ సోమవారాల్లో సప్తగోదావరి జలాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గౌతమి, వశిష్ట, వైనతేయ, తల్వ, భరద్వాజ, కౌశిక, ఆత్రేయ పాయలలో సముద్ర సంగ ప్రాంతం నుంచి సేకరించిన గోదావరి జలాలను మొగల్తూరుకు తీసుకువచ్చి స్థానిక రామాలయం నుంచి గ్రామోత్సవం నిర్వహించి వనమల్లిఖార్జునస్వామికి అభిషేకం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, డైరెక్టర్లు.. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి తదితరులు

పాలక వర్గాలు రైతులకు సేవ చేయాలి

ఆకివీడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధిని కూడా గాలికొదిలేచిందని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. శుక్రవారం ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, వైస్ చైర్మన్ గవరలక్ష్మి, డైరెక్టర్లతో అగ్రికల్చర్ సహాయ సంచాలకులు శ్రీనివాస్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏఎంసీలకు గ్రామాల నుంచి రైతులు ధాన్యం తీసుకొచ్చేవారు కాదని, ఇప్పుడు అటువంటి సమస్యలు తలెత్తకుండా ఈ పాలకవర్గాలు రైతులకు సేవ చేయాలన్నారు. త్వరలో పట్టణ పరిధిలో త్రీస్టార్ హోటల్ కూడా ఏర్పాటు చేయడానికి ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, భరత్, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి చినబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు, డీసీసీ బీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, టీడీపీ ఫ్లోర్ లీడర్ బొల్లా వీరశ్వేత-శేషుబాబు,పిన్నమరాజు శ్రీనివాస రాజు, రామారావు పాల్గొన్నారు.

'శివవర్మ'ను ఆదర్శంగా తీసుకోవాలి

కాళ్ళ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద సేవా సమితి ఏర్పాటు చేసి దాని ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న వేగిరాజు శివ వర్మను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పెద అమిరం పరిధిలో రతన్ టాటా మార్గం నుంచి కె.కన్వెన్షన్ ఎక్స్ రోడ్డు వరకు సుమారు రూ. 2.75 కోట్లతో నూతనంగా నిర్మించిన 'స్వామి వివేకానంద మార్గ్' సీసీ రోడ్డు, కల్వర్టులను శుక్రవారం ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 86 లక్షలు, సమితి ద్వారా కె.కన్వెన్షన్ యాజమాన్యం నిధులు రూ. 69.50 లక్షలు, వీఎస్ఎస్ గార్డెన్స్ యాజమాన్యం ద్వారా 69.50 లక్షలు, ఈ సీసీ రోడ్డుకి ఇరువైపులా ఉన్న కాలనీ పెద్దల నిధులు రూ. 50 లక్షలతో సుమారు 1.25 కి.మీ. పొడవునా నిర్మించిన ఈ మార్గానికి 'స్వామి వివేకానంద మార్గ్' పేరు పెట్టడం శుభపరిణామమన్నారు. రహదారి ప్రారంభం అనంతరం సేవా సమితి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడుతూ శివవర్మ లాంటి వ్యక్తి ప్రతి గ్రామానికి ఒక్కరు ఉంటే ప్రజలకు తమలాంటి రాజకీయ నాయకుల అవసరం ఉండదన్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో 'నివేదిత విద్యాలయం' పేరిట పాఠశాల ఏర్పాటు చేసి పేద ప్రజల పిల్లలకు క్రమశిక్షణతో కూడిన ఉచిత విద్య అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధి వేగిరాజు శివవర్మ, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, కఠారి వెంకటనరసింహరాజు, కంతేటి ఉషా శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మైక్రో వాటర్ ఫిల్టర్ ప్రారంభం

ఉండి: నియోజకవర్గంలోని ప్రజలందరికి స్వచ్ఛమైన మంచినీరు అందించడమే తన లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం వెలివర్రులో మైక్రో వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. సర్పంచ్ పెన్మెత్స అంజనీదేవి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు భరత్, ఉపసర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, మండల టీడీపీ అధ్యక్ష, ప్రధన కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కళ్లేపల్లి సతీష్‌రాజు, జనసేన ఇన్‌చార్జ్ జుత్తుగ నాగరాజు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు పొత్తూరి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ఉండి: హైస్కూల్ విద్యార్థులకు డిప్యూటి స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు కుమారుడు భరత్ చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి వారితో మాట్లాడి నోట్ బుక్స్‌ను అందజేశారు.

వేడంగిపాలెం సొసైటీ బాధ్యతలు స్వీకరణ



పోడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధికి త్రిసభ్య కమిటీలు కృషి చేయాలని పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్ అన్నారు. వేడంగిపాలెం సొసైటీ చెర్మన్‌గా మేడిశెట్టి బుజ్జి, సభ్యులుగా గుడాల శివప్రసాద్, లంకలపల్లి రవీంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ దాసరి రత్నరాజు, పాలకొల్లు డీసీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, వైస్ చైర్మన్ దేవళ్ల ప్రసాదు, దేవళ్ల శ్రీరామకోటి మోహన్ సోదరులు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి పద్మారావు, మండల టీడీపీ అధ్యక్షుడు జి.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సందడి


కేక్ కట్ చేస్తున్న నందమూరి అభిమానులు

పాలకొల్లు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 సినిమా ట్రైలర్ శుక్రవారం విడుదలైంది. ఈసందర్భంగా స్థానిక మారుతీ థియేటర్ వద్ద నందమూరి అభిమానులు సందడి చేశారు. ట్రైలర్ ప్రదర్శనకు ముందు అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు బోణం మునసబు కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. సంఘ మాజీ అధ్యక్షుడు షేక్ సిలార్, అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాసర్ల మాధవ్, కోరాడ రవి, అత్యం చందు, దాడి సాయి పాల్గొన్నారు.

ఇరగవరం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ఇరగవరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇరగవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్‌గా వేంద్ర నాగరాజేశ్వరరావు, డైరెక్టర్లుగా శీలబోయిన శ్రీనివాస్, రాగు వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేశారు. వీరంతా గ్రామంలో ర్యాలీగా సహకార సంఘానికి చేరుకుని ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అయినంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపుల కేసు

భీమవరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ భీమవరం శ్రీరామపురానికి చెందిన పంపనబోయిన పద్మజ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పద్మజకు విజయవాడకు చెందిన రైల్వే ఉద్యోగి దుర్గాప్రసాద్‌తో 2007లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పేదలు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ పథకంలో పేదలు అందమైన నాణ్యమైన ఇళ్లను త్వరగా నిర్మించుకోవడానికి దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. విస్సాకోడేరు లే అవుట్‌లో గృహ లబ్ధిదారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడారు. ప్రధాన రహదారి సరిగా లేదని లబ్ధిదారులు అనుమానించ వద్దని, భవిష్యత్‌లో అందమైన హౌసింగ్ కాలనీ చూడబోతున్నారని అన్నారు. త్వరలోనే ఈ కాలనీ రహదారికి రూ.కోటి 50 లక్షలతో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. కాంట్రాక్టర్ పళ్ళ ఏసుబాబు హౌసింగ్ కాలనీ కార్యక్రమాలను నిర్వహించడానికి ఒక కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. మునిసిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి, హౌసింగ్ పీడీ పిచ్చయ్య, ఎంఈ త్రినాథ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసా యంతో తక్కువ ఖర్చు అధిక ఆదాయంతోపాటు ఆరోగ్య కరమైన ఆహారం అందుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వైనూక రాజు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ కార్యాలయ ఆవరణలో తాడేపల్లిగూడెం వ్యవసాయ డివిజన్‌లోని వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం చేరువ చేసే విధంగా అంతా పనిచేయాలని సూచించారు. అనంతరం ద్రవ జీవా మృతం, ఘన జీవామృతం, తదితర ప్రకృతి వ్యవసాయం కోసం సేంద్రియ ఎరువులు తయారు చేయడం చూపించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయా ధికారి వి.నారాయణ, చీర్ల రవికుమార్, ఏఈవో డి.విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నెలల తరబడి ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు అన్నారు. నవాబుపాలెం సచివాలయం వద్ద ఉపాధి కూలీలతో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో 12 వారాలు పనిచేసిన వారికి కేవలం 2వారాల వేతనాలు అందించడం దారుణమన్నారు. మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు, కండెల్లి విజయ, నూతంగి సూర్యారావు, బైపో ప్రసాద్ పాల్గొన్నారు.

వాసవి విద్యార్థుల సాయం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న భీమవరంకు చెందిన కాసారపు ప్రసాద్‌బాబు కుమారుడు విహంతు అర్జున్‌కు శ్రీవాసవి డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం రూ.10వేల సాయం అందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎన్‌వీ రమణరావు, ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలు అందజేత

ఆచంట, జూలై 25 (ఆంధ్రజ్యోతి):ఆచంట సొసైటీలో రైతులకు కొత్తగా మంజూరు చేసిన పంట రుణాలను శుక్రవారం సొసైటీ చైర్‌పర్సన్ కడలి భాస్కరరావు పంపిణీ చేశారు. క్రాప్ లోన్ కింద కొత్తగా పెట్టుకున్న పదిహేను మంది రైతులకు గాను రూ.14 లక్షల 50 వేలు రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు బలుసు శ్రీరామమూర్తి, తేరం ప్రసాద్, కార్యదర్శి వేండ్ర విష్ణు పాల్గొన్నారు.


ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైద్యులు, రాజకీయ ప్రముఖులు

విరాట్ పిల్లల ఆస్పత్రి ప్రారంభం

పాలకొల్లు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిని దైవంగా బావించి ఆపన్నులకు అండగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్. సత్యనారాయణ మూర్తి (డాక్టర్ బాబ్జి) అన్నారు. శుక్రవారం పట్టణంలో విరాట్ పిల్లల ఆసుపత్రిని డాక్టర్ బాబ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు దండు సంజయ్ వర్మ, డాక్టర్ ఇందుకూరి కావ్యలను ఆయన అభినందించారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలను డాక్టర్ కెఎస్‌పీఎన్ వర్మ, డాక్టర్ ఆర్‌వి. రమణ, ఏఎంసీ మాజీ చెర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విరాట్ ఆసుపత్రి అధినేత డాక్టర్ సంజయ్‌వర్మ మాట్లాడు తూ పట్టణ, పరిసర గ్రామాల్లో ఉచిత వైద్య క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.


అతిథులను సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి

పాలకోడేరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సమావేశం పాలకోడేరు మండలం శృంగవృక్షంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్ర ప్రదేశ్ బీసీ వెల్ఫేర్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నాయీ బ్రాహ్మణ సమస్యలను సంఘ సభ్యులు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. త్వరలోనే అన్ని సమస్యలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు కొడవర్తి శివప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సమావేశంలో మూడు సమస్యలపై తీర్మానం చేశారు. సెలూన్ షాపులకు ఇస్తామన్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వం అర ఎకరం స్థలం కేటాయించాలని, నాయీ బ్రాహ్మణులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఉప్పలపు దుర్గాపెద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పసుమర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు డ్రోన్ స్ప్రేయర్ అందజేత

పెనుగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాగు వ్యయం తగ్గించి రైతులకు మేలు చేయాలన్నదే కూటమి సర్కార్ లక్ష్యమని మార్టేరు డివిజన్ ఏడీఏ రమేష్, ఏవో స్పందన అన్నారు. శుక్రవారం వడలి గ్రామంలో షణ్ముక డ్వాక్రా గ్రూపు సభ్యులు వెలగన స్వాతి, చిటికెన స్వాతి సభ్యులకు డ్రోన్ స్ప్రేయర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ పది నిమిషాలు లోపే ఎకరం పిచికారి చేస్తుందన్నారు. 80 శాతం సబ్సిడితో డ్రోన్ స్ప్రేయర్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

అచ్యుతానందన్ మృతికి నివాళులు

పెనుగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో కన్ను మూసిన కేరళ మాజీ సీఎం, కమ్యూనిస్టు దిగ్గజం వీఎస్ అచ్యుతానందన్ సుదీర్ఘ రాజకీయ జీవితం చరిత్రలో నిలిచిపోతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి కేతా గోపాలన్ అన్నారు. శుక్రవారం పెనుగొండలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్‌కె పాదుషా, నాగిశెట్టి గంగారావు, పులిదిండి రామారావు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్‌ల అందజేత

నరసాపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని రూరల్ సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం కొప్పర్రు హైస్కూల్ విద్యార్థులకు వాలీబాల్ కిట్‌లను ఎస్సై వెంకట సురేష్‌తో కలిసి ప్రిన్సిపాల్‌కు అందించారు. హెచ్ఎం తాతాయ్య, ఉపాధ్యాయులు రాంబాబు, గోపాల్, శ్రీనులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి


నరసాపురంలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

నరసాపురం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలంటూ శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు గేట్ వద్ద న్యాయవాదులు ఆందోళన చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్, డెత్ బెనిఫిట్స్ రూ. 10లక్షలు, న్యాయవాదులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొత్తపల్లి రమేష్, చల్లా దానయ్య నాయుడు, నెక్కంటి క్రాంతి కుమార్, కానూరి బుజ్జి, హర్ష, కాశీనాథ్, నవీన్, సూరిబాబు పాల్గొన్నారు.

భీమవరం క్రైం: న్యాయవాదులపై రోజురోజుకు పెరుగుతున్న దాడులను అరికట్టాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ఐఏఎల్ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లుల శ్రీనివాసరావు, బడుగు అశోక్ డిమాండ్ చేశారు. న్యాయవాదుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు శుక్రవారం కోర్టు ప్రాంగణంలో ఆందోళన నిర్వహించారు.

29న 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన

భీమవరం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 29వ తేదీన భీమవరం డీఎన్నార్ కళాశాలలో 'బుద్ధుడితో నా ప్రయాణం' తెలుగు నాటకం ప్రదర్శిస్తున్నట్లు ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నేషనల్ ట్రస్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిచర్ల హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనా జోసఫ్ తెలిపారు. . శుక్రవారం అంబేడ్కర్ భవనంలో తెలుగు నాటకం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. 29 సాయంత్రం 6-30 గంటలకు నాటకం ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఈది రవికుమార్, జనరల్ సెక్ర టరీ కొల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్యులకు కూడా బుద్ధుడి జీవిత చరిత్ర తెలియజేయాలనే సంకల్పంతో ఇప్పటికే 16 జిల్లాల్లో ఈ నాటకాన్ని ప్రదర్శించడం జరిగిందని అన్నారు.

డీలర్ల సంఘ నాయకులకు సన్మానం



నరసాపురం, జూలై 25: డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన అధికారి ఏసు, కార్యదర్శిగా కనగళ్ళ బాబు, సం యుక్త కార్యదర్శిగా ఎన్నికైన సమయ మంతుల సర్వేశ్వరరావులను శుక్రవారం డీలర్ల సంఘం ఘనంగా సన్మానించింది. ఇటీవల విజయవాడలో జరిగిన సంఘం ఎన్నికల్లో వీరి ముగ్గురికి రాష్ట్ర పదవులు దక్కాయి. ఈ నేపథ్యంలో తహసీల్దారు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అధికారి ఏసు మాట్లాడుతూ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంఘం ఎప్పుడు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నరసాపురం సివిల్ సప్లై డీటీ మహేష్, డీలర్లు యుగంధర్, శ్రీనివాస్, మురళీ, మాణిక్యాలరావు, మసీన్, రమణ, జగదీష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

భీమవరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బైపాస్ రోడ్డులోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. టూటౌన్ సీఐ కాళీచరణ్ మాట్లాడుతూ ప్రయాణాలు చేసినప్పుడు, మన రక్షణ కోసం పోలీసులకు సమాచారం అందించడానికి 112కు డయల్ చేయడం గాని, శక్తి యాప్‌ను ఉపయోగించడంగాని చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సమతం వెంకయ్య నాయుడు అధ్యక్షత వహించగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ మాయాజాలంలో ఎంతో మంది మోసపోతున్నారని అన్నారు.

అదాని స్మార్ట్ మీటర్లతో పేదలపై భారం

తాడేపల్లిగూడెం, జూలై 25(ఆంధ్రజ్యోతి): అదాని స్మార్ట్ మీటర్లతో పేదలపై పెనుభారం పడుతుందని సీపీఎం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలపై కరెంట్ భారాలు వేసే అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించే చర్యలు తక్షణమే ఆపాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కడకట్ల, రామారావుపేటలో కరపత్రాలను పంచారు.

శ్రావణ శుక్రవారం పూజలు


పాలకొల్లులో కనక దుర్గమ్మకు అలంకరణ

తణుకు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని ఉన్న శ్రీఅమ్మ నాంబ ఆశ్రమంలో మాతాజీ శాంతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తులు శ్రావణ మాస పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

పాలకొల్లు అర్బన్: యడ్ల బజారులోని కనక దుర్గమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా 1200 మందికి అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో కుంకుమ పూజలు చేశారు. క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ దేవి, లక్ష్మీ దేవిలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

రోగులకు సత్వర సేవలందించాలి


అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

తణుకు, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల బారిన పడిన రోగులకు సత్వర సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.గీతాబాయి అన్నారు. శుక్రవారం బ్యాంకు కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించారు. సేవలతో పాటు పలు వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్. ఎన్. డేనియల్ రాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల బదిలీపై వచ్చిన వారు వెంటనే విధుల్లో చేరి క్షేత్రస్థాయి ప్రామాణిక సర్వే చేయాలని చెప్పారు. అనంతరం పలు ఆసుపత్రులను, స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేశారు. తణుకులోని ముళ్ళపూడి వెంకటరమణ మెమోరియల్ ఆసుపత్రి, ముళ్ళపూడి కార్డియోసెంటర్, యునైటెడ్ డయోగ్నస్టిక్ సెంటర్, శ్రీతేజ ఆసుపత్రులను తనిఖీ చేశారు.

మత్తుకు దూరంగా ఉండండి

తాడేపల్లిగూడెం, జూలై 25(ఆంధ్ర జ్యోతి): మత్తుపానీయాలకు ప్రజలంతా దూరంగా ఉండాలని దీక్షాడ్రగ్-డిఎడిక్షన్ సెంటర్ నిర్వాహకులు మల్లిపూడి మిత్ర కోరారు. మార్కెట్‌యార్డులో జట్టు కార్మికులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తుకు బానిసలైన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని హెచ్చరించారు. బానిసలుగా మారిన వారిని మెరుగుపరిచేందుకు తమ డీఎడిక్షన్ సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎడిక్షన్ కౌన్సిలర్ పీ వెంకటేష్, దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు ఎన్‌కేపీ ప్రసాద్, పీ నాగలక్ష్మి, టి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నలుగురికి కోడి రామకృష్ణ అవార్డులు

పాలకొల్లు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పాలకొల్లుకు చెందిన ప్రముఖ దర్శకుడు, స్వర్గీయ కోడి రామకృష్ణ పేరుతో ప్రతి ఏటా ఇచ్చే కళా, సేవ అవార్డులు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో అందించారు. సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఆధ్వర్యంలో కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా అందించిన అవార్డులను పట్టణానికి చెందిన తెలుగు సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, రంగస్థల నటుడు, వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగి గుడాల హరిబాబు, శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం, రక్తదాన స్ఫూర్తి ప్రదాత ధనాని సూర్య ప్రకాష్‌లు అవార్డులను అందుకున్నారు. అవార్డులను సినీ నటులు మురళీ మోహన్, సుమన్, దర్శకులు రేలంగి నరసింహారావు, అల్లరి నరేష్, నటి కవిత, నిర్మాత కొణిదెల హారిక తదితరులు అందజేశారు.

'ఎంఈవో తీరు ఇబ్బందికరం'

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పట్ల తాడేపల్లిగూడెం ఎంఈవో హనుమ తీరు ఇబ్బందికరంగా ఉన్నదని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వేదాల ఉదయ్ కుమార్ విమర్శించారు. ఉపాధ్యాయులంటే ఇంట్లో పనిమనుషుల కంటే హీనంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఎంఈవోపై డీఈవో చర్యలు తీసుకోకుంటే ఎస్టీయు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ ఆరోపణలపై ఎంఈవో వి.హనుమను వివరణ కోరగా తనపై కక్షపూరితంగా ఎస్టీయు సంఘానికి చెందిన ఉదయ్ కుమార్ వ్యవహరిస్తున్నారని, ఉద్దేశ పూర్వకంగా తనకు రాత్రి సమయంలో ఫోన్‌చేసి రెచ్చగొట్టేలా మాట్లాడి ఫోన్ రికార్డింగ్ చేశారని, ఆ రికార్డింగ్‌లో కూడా ఎంఈవో ఉద్యోగాన్ని తక్కువ చేస్తూ మాట్లాడారని పేర్కొన్నారు.

పరిశ్రమల స్థాపన దరఖాస్తులకు అనుమతులివ్వాలి

భీమవరం టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులకు నిర్ణీత గడువులోపుగా అనుమతులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ముందుగా గత సమావేశంలో చర్చించిన అంశా లపై జిల్లా పరిశ్రమల అధికారి తీసుకున్న చర్యలను నివేదించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ర్యాంపు పథకం అనేది సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, దీని ముఖ్య ఉద్దేశం ఎంఎస్ఎంఈల స్థాయిని పెంచడం అన్నారు. జిల్లాలో ఈ పథకం అమలుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ఉద్యమ్, వెండర్ డెవలప్మెంట్ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో కీలకమైనవని అన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి ఇప్పటివరకు వివిధ శాఖల అనుమతుల కోసం 193 దరఖాస్తులు రాగా 185 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని, మరో 8 దరఖాస్తులు పరిష్కరించవలసి ఉందన్నారు.